## వచ్చే నెల 25 నుంచి సమ్మర్ క్యాంపులు

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు సమ్మర్‌లో తెగ ఎంజాయ్ చేయాలనుకుంటారు.. పల్లెటూర్లకు వెళ్లే వాళ్లు కొందరైతే స్విమ్మింగ్, స్కేటింగ్, బ్యాడ్మింటన్, క్యారం, చెస్, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ తదితర స్పోర్ట్స్‌లలో ప్రతిభ చాటాలని భావిస్తుంటారు. జీహెచ్ఎంసీ క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి సంవత్సరం పిల్లలకు విద్యతో పాటు ఆట పాటలు అవసరం ఉందంటూ ఔట్‌డోర్, ఇండోర్ స్పోర్ట్స్‌తో పాటు పెయింటింగ్ తదితర మనోవికాసాన్ని పెంచే ఫన్నింగ్ గేమ్స్‌లలో శిక్షణ ఇస్తుంటారు. ఇందులో భాగంగానే వచ్చే నెల 25వ తేదీ నుంచి మే 31 వరకు 37 రోజుల పాటు 44 క్రీడలపై శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. గ్రేటర్ వ్యాప్తంగా 353 క్రీడా మైదానాలలో ఆరు సంవత్సరాల వయస్సు నుంచి 16 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలలో క్రీడా నైపుణ్యతను పెంపొందించేందుకు వేసవి శిక్షణ తరగతనులను నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

## 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

సిటీబ్యూరో, మార్చి 28 ( నమస్తే తెలంగాణ ) : సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఉచిత ఓరియంటేషన్ తరగతులు అందిస్తున్నది. అందులో భాగంగా విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ కోసం నిర్వహిస్తున్న ఉచిత మాస్టర్ క్లాస్ ఓరియంటేషన్ సెషన్లను శుక్రవారం అకాడమీ ఛైర్మన్ శ్రీ పి. కృష్ణ ప్రదీప్, డైరెక్టర్ డా. భవానీ శంకర్ లతో కలిసి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పరిశీలించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లా రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు జూన్‌లో భారీ స్థాయిలో సెమినార్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కేవలం సాఫ్ట్‌వేర్, ఎంఎన్‌సీ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లను విద్యార్థులు లక్ష్యంగా పెట్టుకోవాలి అని మల్లారెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో మల్లా రెడ్డి ఇన్‌స్టిట్యూషన్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీ ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికకు ఇండిపెండెంట్ నామినేషన్

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ) ః జీహెచ్ఎంసీ స్థానిక సంస్థల ఎన్నిక నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. శుక్రవారం ఇండిపెండెంట్ అభ్యర్థి సి. చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి అనురాగ్ జయంతికి చంద్రశేఖర్ తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. వచ్చే నెల 4వ తేదీ వరకు నామినేషన్లు, 9వ తేదీన ఉపసంహరణ, 23న పోలింగ్, 25న కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.

## చర్లపల్లి వరకే కృష్ణా ఎక్స్‌ప్రెస్

సిటీబ్యూరో, మార్చి28,(నమస్తే తెలంగాణ): చర్లపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రాకుండా చర్లపల్లికే పరిమితం చేస్తున్నట్లు రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రయాణికులంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి తిరిగి ఇంటికి వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. రవాణా సౌకర్యాలు లేక ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్లపల్లి నుండి సరైన రవాణా సౌకర్యాలు కల్పించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.





**ఇఫ్తార్ విందు**

ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్ రోడ్ నెం 11లోని లేక్ వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో భారీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే టి.హరీశ్ రావు, మాజీ మంత్రి మహమూద్ అలీ, వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కే.విప్లవ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. *– బంజారాహిల్స్,మార్చి 28*

**వారాసిగూడలో**

సికింద్రాబాద్ నియోజకవర్గం లోని బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడ లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు, సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావు గౌడ్ , కార్పొరేటర్లు శైలజ, హేమ, సునీత, యువ నేత రామేశ్వర్ గౌడ్, కరాటే రాజు, కంది నారాయణ, గరికపాటి చంద్రశేఖర్, మల్లూరి అనిల్, అశ్విన్, వంజరి సతీష్, నవీన్ గౌడ్, నిర్వాహకులు బషీర్, అబ్దుల్, మునావర్, తదితరులు పాల్గొన్నారు. *– సికింద్రాబాద్, మార్చి 28:*

# వాంతులు.. విరేచనాలు.. జ్వరం

### ఫీవర్ ఆసుపత్రికి నగరవాసుల క్యూ.. శీతల పానియాలే కారణమంటున్న వైద్యనిపుణులు

సిటీబ్యూరో, మార్చి28, (నమస్తే తెలంగాణ): మన శరీరానికి కాస్తంత ఎండ తగిలితే చాలు.. శీతల పానియాలు తాగేందుకు వెనుకాడం. ఇక ఎండాకాలం వస్తే చెప్పనవసరం లేదు. రోడ్లపైన కనిపించే కూల్ డ్రింక్ దుకాణాల ముందుకు పరుగులు తీస్తూ వెళ్లి మరీ తాగుతాం. అయితే ఎక్కడపడితే అక్కడే నాణ్యత, పరిశుభ్రత విషయాలు పక్కన పెట్టి వెంటనే చల్లగా ఐస్ వేసుకొని తాగుతారు. మరీ ఆ ఐస్ శుభ్రంగా ఉందో లేదో కూడా క్షణమైనా ఆలోచించకుండా ఆ పానీయాలు తాగి చివరకు వాంతులు, విరేచనాలకు గురవుతారు. దీంతో క్రమంగా జ్వరాల బారిన పడతారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో ఇదే ధోరణి కొనసాగుతున్నది. నల్లగుంటలో ఉన్న ఫీవర్ ఆసుపత్రికి మూడు రోజుల నుంచి 1400 వరకు ఔట్ పేషెంట్లు వాంతులు, విరేచనాలు, జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం రావడం ఆందోళనను కలిగిస్తున్నది.



### ముప్పు వాటివల్లే..

బయట నిమ్మరసం, చెరుకు రసం వంటి శీతల పానీయాల్లో వేసే ఐస్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఐస్ తయారీ అనంతరం దాన్ని తరలించేందుకు ఆటోలు, ఇతర వాహనాల్లో తరలించే సందర్భంలో అనేక క్రిములు దానిపై చేరుతాయి. అనంతరం డ్రమ్ములో దాన్ని నిల్వచేసి, మనకు కూల్ డ్రింక్స్‌లో కలిపి దుకాణదారులు ఇస్తారు. వాటిలో ఏర్పడే క్రిములు మన శరీరంలోకి చేరి, అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయి. దీంతో రోగాలతో బాధపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

### ఓపీల్లో అధిక శాతం వారే..

హైదరాబాద్ జిల్లాలో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అందులో భాగంగా ప్రజలు ఎండ నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలను విపరీతంగా తాగుతున్నారు. రోడ్ల పక్కన పుట్‌పాత్‌లపై, బండ్లమీద, బేకరీల్లో విక్రయించే కూల్ డ్రింక్స్‌ను లొట్టలేసుకుంటూ.. తాగుతున్నారు. నిజానికి చెరుకు రసం, ఇతర శీతల పానీయాలు తయారు చేసేందుకు వాడే ఐస్ అపరిశుభ్రంగా ఉండటం, చుట్టూ ఈగలు చేరడం మూలానా వాటిని తాగిన వెంటనే గొంతునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని కింగ్ కోటీ, ఫీవర్, ఏరియా, బస్తీ దవాఖానాల్లో అనారోగ్యంతో వచ్చే ఔట్‌యపేషెంట్లలో అధిక శాతం జ్వరం, గొంతు నొప్పి, వాంతులు వంటి సమస్యలతో బాధపడుతున్నవారే ఉండటం గమనార్హం.

## యూడీఐడీ కార్డుల జారీ వేగవంతం..



ఎర్రగడ్డ దవాఖానలో వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఇతర అధికారులు

సిటీ బ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): జిల్లాలో అంగవైకల్య, మానసిక రోగులకు యూనిక్ డిజబులిటీ ఐడీ కార్డుల పంపిణీ వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ మానసిక వైద్యశాలను డీఆర్‌వో వెంకటాచారితో కలిసి ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని సదరం కేంద్రాన్ని పరిశీలించి సత్వరమే మౌలిక వసతులు కల్పించి అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యూడీఐడీ సర్టిఫికెట్లు జారీ చేయడానికి ఉస్మానియా( ఆర్థోపెడిక్), సరోజినీ(అంధులు), ఈఎన్టీ (చెవిటి, మూగ), నీలోఫర్( పిల్లలు), ఎర్రగడ్డ మానసిక దవాఖాన(మానసిక రోగులు)లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ ఆర్. అనిత తహసీల్దార్ పద్మ సుందరి, వివిధ విభాగాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీ బ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య విధాన పరిషత్ పరిధిలోని దవాఖానాల సూపరింటెండ్లు, స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డీసీహెచ్ డాక్టర్ రాజేంద్రనాథ్ తో కలిసి పాల్గొన్నారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, జర్నర్ సర్జరీలు, ఆరోగ్యశ్రీ, డయాలసిస్ కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని దవాఖానల్లో ఓపీ శాతం ఎక్కువగా ఉండాలని సూచించారు. ప్రసూతి వైద్యులు ఎక్కువగా సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇవ్వాలని, సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రులలో అవసరమైన వైద్య పరికరాలు కొనుగోలుకు ప్రతిపాదనలు పంపాలని, కాంట్రాక్ట్ వైద్యాధికారుల ఖాళీల వివరాలు అందించాలని సూచించారు.

# మహిళా సంఘాల వనభోజనం

బడంగ్ పేట్, మార్చి28: ఉగాది పర్వదినం సందర్భంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ని నాదర్ గుల్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన భోజనాల కార్యక్రమానికి మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. స్వయంగా వంటలు చేసి వారితో కలిసి భోజనం చేశారు. ఈ వనభోజనంలో మాజీ కౌన్సిలర్ మమతా సుదర్శన్ రెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, జలాల్పూర్ సునీత బాలరాజ్, సరిత, సరోజ తదితరులు ఉన్నారు.



మహిళలతో కలిసి వన భోజనం చేస్తున్న మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

## ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలందించాలి



సిటీబ్యూరో, మార్చి28, (నమస్తే తెలంగాణ): జిల్లాలోని 30 పడకలకంటే ఎక్కువ ఉన్న ప్రైవేట్ ఆసుపత్రులన్నీ తప్పనిసరిగా రాజీవ్ గాంధీ ఆరోగ్యశ్రీ కింద వర్తించే వైద్యసేవలందించాలని హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి సూచించారు. శుక్రవారం రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సహకారంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంపానెల్‌మెంట్‌పై గాంధీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశ మందిరంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద ఎంపానెల్‌మెంట్ కోసం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చాలా సులభతరమైన ప్రక్రియ చేపట్టిందని అందరూ ఆరోగ్యశ్రీ కింద ఎంపానెల్‌మెంట్ చేసుకోవాలన్నారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జనరల్ మేనేజర్ డాక్టర్ రాంబాబు ఎంపానెల్‌మెంట్ విధివిధానాలు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 105 ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు హాజరయ్యారు.

## రూ.500 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### ఆరె కటిక అభివృద్ధి సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్

చిక్కడపల్లి, మార్చి 28: ఆరె కటికల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని.. ఈ మేరకు రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరె కటిక అభివృద్ధి సంఘం అధ్యక్షుడు భూంపల్లి అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్ కుమార్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్చి 11న రవీంద్రభారతిలో సభ నిర్వహించినా డిమాండ్లు నెరవేరలేదన్నారు. రాష్ట్రంలో నాలుగు శాతానికి పైగా జనాభా ఆరె కటికలేదన్నారు. బీసీ 'డి'లో ఉన్న తమకు బీసీ హోదా కల్పించాలన్నారు. మటన్ షాపులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నందీశ్వర,ఉపాధ్యక్షుడు నాగ శేషు, నాయకులు జె. శ్రీనివాస్, దినేష్, వినోద్, జానకిరామ్ పాల్గొన్నారు.

## గ్రేటర్ @ 39.1డిగ్రీలు

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో మధ్యాహ్నం సమయంలో జనం బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలతో వేడిగాలులు మొదలయ్యాయి. దీంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.1డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.4 డిగ్రీలు, గాలిలో తేమ 28శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా రాగల మూడు నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశాలున్నట్లు అధికారులు హెచ్చరికలు జారీచేశారు.



శుక్రవారం జూబ్లీహిల్స్‌లో వాహనదారులను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు


## మెరుగైన సేవల కోసం ట్రాయ్ వర్క్‌షాప్

సిటీబ్యూరో, మార్చి28, (నమస్తే తెలంగాణ): టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం లో టెలికాం వినియోగదారుల సంస్థల సామర్థ్య పెంపుదల కోసం, మెరుగైన సేవలందించేందుకు శుక్రవారం సౌత్ జోన్ ప్రాంతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. టెలికమ్యూనికేషన్స్, ప్రసార నియమాలు, వినియోగదారుల హక్కులు, సంప్రదింపులు, నిబంధనలు ,సైబర్ భద్రతా అవగాహనపై చర్చించారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర నుండి టెలికాం వినియోగదారుల సంస్థల ప్రతినిధులుతో పాటు ప్రధాన టెలికాం కంపెనీలు ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్ ఐడియా సంస్థలు పాల్గొని ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల ప్రయోజనాల కోసం ట్రాయ్ చేస్తున్న ప్రయత్నాలు, ప్రసార నిబంధనలు, వినియోగదారుల కోసం ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, మొబైల్ నంబర్ పోర్టబిలిటీ వంటి అంశాలపై చర్చించారు. కాగా సైబర్ మోసాలపై ఆర్బీఐ హైదరాబాద్ ఏజీఎం తేజదీప్త బెహరా, ఐటీఎస్ డీడీజీ హేమంత్ రథ్వే ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో ట్రాయ్ ప్రాంతీయ కార్యాలయ సలహాదారు బి. ప్రవీణ్ కుమార్, సంయుక్త సలహాదారు కేవీ సురేష్‌బాబు జాయింట్ అడ్వైజర్ వి.ఎస్. రాజు, జాయింట్ అడ్వైజర్ శ్రీ సి. భిక్షం, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ సి. ఉదయ్‌కుమార్, ఎ. కిష్టయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఫీడర్ సమస్యలకు ..ఆన్ లైన్ మానిటరింగ్‌తో చెక్

సిటీబ్యూరో, మార్చ్28(నమస్తే తెలంగాణ): విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గుల సమస్యలు వెంటనే గుర్తించేందుకు వీలుగా టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే అధిక ఒత్తిడికి గురవుతున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న ఇన్సులేటర్లు, ఫ్యూజ్‌బాక్సులు, శిథిలావస్తకు చేరిన స్తంభాలు, లూజ్‌లైన్లను గుర్తించి వాటిని సాసా వెబ్‌పోర్టల్‌లో డిస్కం పొందుపరిచింది. తాజాగా 11కేవీ ఫీడర్ల మానిటరింగ్ కోసం ఫీడర్ ఔటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నది. దీని ద్వారా ఏ ఫీడర్‌పై ఎంత మేరకు ఒత్తిడి ఉంది? ఏరోజు ఎన్ని నిముషాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది? ఎంత సమయంలో సరఫరా పునరుద్ధరించారనే సమాచారం నిక్షిప్తమవుతుంది. డిస్కం కేంద్రకార్యాలయంలోని ఉన్నతాధికారులతో పాటు క్షేత్రస్థాయిలోని ఏఈల మొబైల్‌ఫోన్లకు సమాచారం వస్తుంది. దీంతో లైన్ల నిర్వహణ, పునరుద్ధరణ పేరుతో క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు అడ్డగోలుగా అమలు చేస్తున్న ఎల్‌సిలకు చెక్ పడుతుందని డిస్కం ఉన్నతాధికారులు చెప్పారు.



### ఏప్రిల్ మొదటివారంలో అందుబాటులోకి..!

జీహెచ్ఎంసీ పరిధిలో 11కేవీ ఫీడర్లు 3412వరకు ఉన్నాయి. ఒక్కో ఫీడర్ కొన్ని కిలోమీటర్ల విస్తరించి ఉంటుంది. ఫీడర్‌పై 25 నుంచి 50 వరకు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటాయి. ఒక్కో డిటిఆర్ పరిధిలో 50 విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. గృహయజమానులు విద్యుత్ యజమానులు కనెక్షన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఒక కిలోవాట్, రెండు కిలోవాట్లకు పరిమితమవుతుంటారు. ఆతర్వాత విద్యుత్ ఉపకరణాలు ఎక్కువగా కొనుగోలు చేయడంతో సామర్థ్యానికి మించి భారం పడుతోంది. దీంతో దగ్గరలో ఉన్న డీటీఆర్, సబ్‌స్టేషన్లలోని ఫీడర్లపై ఈ భారం పడుతున్నది. ఉష్ణోగ్రతలు పెరుగుతూ, అధిక విద్యుత్ వినియోగం కావడంతో ఫీడర్లపై భారం పడి ట్రిప్ అవుతున్నది. దీంతో ఈ పరిస్థితిని అంచనా వేయడానికి కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నారు. తొలిదశలో జీహెచ్ఎంసీ పరిధిలో 2వేల ఫీడర్లకు ఈ టెక్నాలజీని ప్రయోగించాలని ఏర్పాట్లు చేశారు. ఏప్రిల్ మొదటివారంలో ఫీడర్ ఔటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అందుబాటులోకి తెస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.